అపుడు తెలిసివచ్చింది ఆయన భార్యకు ఒంటరితనం అంటే ఏమిటో. పది గంటల తరువాత ఎవరూ ఇంట్లో వుండరు. పిల్లలు స్కూలుకు, భర్త ఆఫీసుకు వెళ్తారాయె. బిక్కు బిక్కుమంటూ తను ఒక్కతే ఇంట్లో వుంటుంది. భర్తతో రోజూ చెప్తూనే వుంది 'ఏదో భయం వేస్తున్నది' అని. కానీ ఆ మహానుభావుడు పట్టించుకోడాయె. లంకంత ఇల్లు. ఒంటరితనం. ఎపుడు చుట్టూ జనసందోహం. ఒక రోజు ఆమె భయపడిన విధంగానే జరిగింది. ఆమె నిద్రపోతూ వుండగా పట్టపగలు ఇంటిని దోచారు దొంగలు. వెంకటరమణయ్య సంపాదించినదంతయు పోయింది. పోలీసు రిపోర్టు ఇచ్చి ఆ ఇంటికి ఏదో శని పట్టినదని తిట్టుకుంటూ ఖాళీ చేశాడు వెంకట రమణయ్య.

అలా ఆ ఇల్లు మొత్తం ఖాళీ చేయబడి ఇంటి యజమానికి అప్పగించబడినది.

* * *

ఆ మహాపట్నంలో ఖరీదయిన ఎ.సి. హోటల్లోని రూములోని స్నానాల గదిలోని టబ్‌లో స్నానం చేస్తూ వుంది అందాలరాశి లచ్చుమమ్మ ఉరఫ్ తీర్థా. అపుడే కాలింగ్ బెల్ మోగింది. టవల్ చుట్టుకుని వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా కాంట్రాక్టర్ రామలింగం. ఇద్దరూ లోపలికి దారి తీశారు. సోఫాలో కూర్చుని ఆమెకు ఏ భైవేల రూపాయిలకు డి.డి. ఇచ్చినాడు. ఈ ఊరు వచ్చిన మొదటి రోజు అదే హోటల్లో అదే రూమ్‌లో అతను కలిసి తను చేయవలసిన పని చెప్పి వెళ్ళిపోయాడు. తాను పని ముగించుకుని వచ్చిన తరువాత మళ్ళీ అక్కడే కలుసుకున్నారు వారు. ఇప్పుడు వివరంగా విషయం చెప్పాడు-

"ఒక సంవత్సరం క్రితం ఆ సెంటరులోని బిల్డింగును ఎం.ఎల్.ఎ. కొండ్రావు కొన్నారు గజం వెయ్యి రూపాయిల చొప్పున. కాని పదిహేను సంవత్సరాలుగా ఆ ఇంట్లో నివాసమేర్పరచుకున్న ఈ నలుగురు ఇల్లు ఖాళీ చేయక కోర్టుకు వెళ్ళారు. కొండ్రావు లక్ష రూపాయిలు ఇవ్వచూపారు. వాళ్ళు ఒప్పుకోలేదు. ఇక లాభం లేదని ఆ లక్ష రూపాయిలు పెట్టి ఆ ఇల్లు ఖాళీ చేయించమని నన్ను పురమాయించారు. నేను నిన్ను మద్రాసునుంచి పిలిపించి నీ ద్వారా ఖాళీ చేయించాను. అందుకే నాకు ఏభై వేలు, నీకు ఏభై వేలు''అన్నాడు లింగం. మళ్ళీనయినా సినిమాలలో ఛాన్సు తగలకపోతుందా అని మద్రాసు బయలుదేరింది తీర్థా.

* * *

మహా నగరాలలో ఇటువంటి జీర్ణావస్థలో వున్న మేడలు అనేకం వున్నాయి. వాటిలో అద్దె లేకుండా హాయిగా వుంటున్న కోర్టు పక్షులు అనేకమంది వుంటున్నారు. వారి చేతుల్లో చిక్కి బాధపడుతున్న ఇంటి యజమానులకు ఈ చిరు కథ అంకితం. ●




రామోజీగుడా, లక్ష్మోజీగుడా నేషనల్ హైవేకి చెరొకవైపు వున్న రెండు గ్రామాలు.

రెండు పంచాయతీ ఆఫీసులూ ఒకదానికొకటి కనుచూపుమేరలో వుంటాయి. ఉనికిలోను, పేరులోను వున్న సామీప్యం పాలకవర్గాల మధ్య లేదు. ఇద్దరు గ్రామాధ్యక్షులూ రెండు విభిన్న పార్టీలకు చెందినవాళ్ళు.

స్పర్థలూ, వైషమ్యాలతో పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే వాతావరణం. ఈ పాలకులు జరిపే కార్యక్రమాలు అందరికీ తెలిసినంతవరకు రెండే.

పంద్రాగస్టునాడూ, చబ్బీ జన్వరి రోజునా జెండా ఎగరవెయ్యడం. మిగతా రోజుల్లో వారి వారి బలాలు స్థిరపరచుకోవడం, ప్రదర్శించుకోవడంతోనే సరిపోతుంది.

ఒక పంద్రాగస్టు రోజు రామోజీగుడా పంచాయతీ ఆఫీసు ముందు జెండా వందన సమయంలో నేనక్కడ నిలబడి వున్నాను. గ్రామాధ్యక్షుడు జెండా

**1988 వినాయక చవితి కాలం దాటని కథల పోటీలో రు. 75/-లు గెల్చుకున్న కథ**

ఎగరవేశాక 'జనగణమన...' పాడుతున్నారు. నాకు దగ్గరలోనే సుమారు ఏడేళ్ళ కుర్రవాడు వాడి నాయనతో నసుగుతున్నాడు. "నాయనా- ఉల్టా చేసిన్రు. మా ఇస్కూల్ల ఇట్ల జెయ్యరు" అంటున్నాడు.

వినే సహనం లేని వాడి నాయన "ఊకో- మిఠాయి బెరసేపయినాక, ఇప్పుడియ్యరు" అని కసురుకుంటున్నాడు. ఆ కుర్రవాడి మాటలకు నాకేదో స్ఫురించి ఎగురుతున్న జెండా చూశాను.

ఆకుపచ్చ రంగు మీదకు పోయి ఉల్టాగా ఎగురుతోంది. అప్రయత్నంగా లక్ష్మోజీగుడా ఆఫీసువేపు చూశాను. ఆ జెండా సవ్యంగా ఎగురుతోంది.

క్రిందటి సాయంత్రం వానవల్ల ఒకటి రెండు పరుగు పందాలు ఆగిపోయాయి. అవి జరిపి, తర్వాత బహుమతులూ, స్వీట్లూ పిల్లలకు పంచే ప్రయత్నం జరుగుతోంది. ఆ హడావుడిలో పద్ద కుర్రాడు వాడి మనసులోని సమస్యను మరిచాడు. ఎగురుతున్న పతాకాన్ని సవరించాలంటే క్రిందకు దించి మళ్ళా ఎగురవేయక తప్పదు. ప్రత్యర్థుల దృష్టి నాకర్షించక తప్పదు. పత్రికలో ప్రముఖంగా ఈ వార్త చోటు చేసుకోక తప్పదు. ఆ అప్రతిష్ఠను రామోజీగుడా పాలకులు సహించలేని పరిస్థితి.

ఆ కారణంగా తప్పు ఎలా జరిగినా, ఎత్తిచూపించినవాడి మీద కోపం మళ్ళక తప్పదు. ఇలా సతమతమై ఊరుకున్నాను.

ఆశ్చర్యమేమిటంటే ఆ విషయం ఆ చిన్న కుర్రవాడికీ, వాడి సణుగుడు వల్ల నాకూ తప్ప ఇంకో వ్యక్తికి పట్టకుండా జెండా హాయిగా ఎగిరింది. ఒక పరుగు పందెంలో ఆ చిన్న వెధవాయ్ మూడవ స్థానంలో వచ్చాడు. వాళ్ళు రెండే బహుమతులు ప్రకటించారు. నేను కలగజేసుకుని నా తరపున ఒక ప్రత్యేక బహుమతిని ప్రకటించేటట్టు అక్కడ పెద్దలతో ఒప్పించాను. ఆ పిల్లవాడి మొహం ఆనందంతో వికసించింది.

ఆ రాత్రి నిద్రించే వేళ ఒక వింత ప్రశ్న మనసులో రేగి నన్ను నిలదీసింది. "ప్రత్యేక బహుమతి కుర్రవాడి పరుగులో ప్రతిభకా? లేక వాడి పరిశీలన శక్తికా!" అన్నదే ఆ ప్రశ్న.

"ఆ రెండింటికీ మించిన (నాలో లేని) గుణ విశేషానికి" అని జవాబు చెప్పుకున్నాను.

ఎదురుగా కనిపిస్తున్న అవలక్షణాన్ని చూస్తూ నోరైనా మెదపలేని పిరికితనం నాది. చూసిన పొరపాటును పైకి అనకుండా వుండలేని నిజాయితీ వాడిది. మనస్సెందుకో తేలికపడింది. నిద్ర నన్ను జయించింది.

—గిడుగు రాజేశ్వరరావు